క్లుప్తంగా

గురుకుల కళాశాల సందర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్: మొయినాబాద్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలను చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య గురువారం సందర్శించారు. కళాశాల విద్యార్థులతో మాట్లాడి వసతులు, సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. భోజనం, నీటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్న తన దృష్టికి తేవాలని విద్యార్థులు, అధ్యాపకులకు సూచించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం ఆశవర్కర్లు సీఐటీయూ నాయకులతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఆశకార్యకర్తలు మాట్లాడుతూ.. ఎంతో కాలంగా సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో తాము ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బీస సాయిబాబా, తదితరులు ఉన్నారు.

ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం



జ్ఞానేశ్వర్‌ను సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్: ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన బొర్రా జ్ఞానేశ్వర్‌ను గురువారం షాద్‌నగర్ ముదిరాజ్ సంఘం తాలుకా నాయకులు కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని కార్పొరేషన్ కార్యాలయానికి వెళ్లిన నాయకులు చైర్మన్ జ్ఞానేశ్వర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు మంగ వెంకటేశ్, అంచ రాములు, పైలయ్య, అంజయ్య, శ్రీధర్‌వర్మ, నలమోని శ్రీధర్, విఠ్యాల శ్రీకాంత్, తుమ్మల గోపాల్, మంగ మధు, మేకం రాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నర్సింహ

కేశంపేట: మండల పరిధిలోని కొనాయపల్లి గ్రామానికి చెందిన సొప్పరి నర్సింహను ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమిస్తూ ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ నియామక పత్రం అందించారు. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నర్సింహాకు నియామకపత్రం అందించిన అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీని బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

చేవెళ్ల: బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మండలంలోని అల్లవాడ గ్రామానికి చెందిన తాళ్ల ఆంజనేయులుగౌడ్‌ను ఎంపికయ్యారు. గురువారం నగరంలో ఆయనకు ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంజనేయులుగౌడ్ మాట్లాడుతూ.. పార్టీలోని ఓబీసీ సెల్ బలోపేతానికి తనవంతు కృషిని అందిస్తానని చెప్పారు. తనఎంపికకు కృషి చేసిన రాష్ట్ర, జిల్లా నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ భూమిలో మొక్కల తొలగింపు

మొయినాబాద్: మండల పరిధిలోని చిలుకూరు రెవెన్యూ సర్వే నెంబర్ 277 ప్రభుత్వ భూమిలో సురభి వెంచర్ అసోసియేషన్ సభ్యులు నాటిన మొక్కలను గ్రామస్తులు తొలగించారు. గురువారం పెద్దసంఖ్యలో సురభి వెంచర్‌లోకి వెళ్లి ప్రభుత్వ భూమిలో నాటిన మొక్కలను తొలగించారు. వెంచర్‌లో ఉండే కొంతమంది అడ్డుకునే ప్రయత్నం చేసినా ఆగకుండా మొక్కలన్నీ తొలగించారు. అనంతరం తహసీల్దార్ గౌతమ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూమిలోకి ఎవరు ప్రవేశించినా కేసులు నమోదు చేస్తామని.. ప్రభుత్వ భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామని తహసీల్దార్ చెప్పారు.



అధ్వానంగా బోడంపహాడ్ రోడ్డు



గుంతల్లో నీరు నిలవడంతో కుంటలను తలపిస్తున్న మన్‌మర్రి రోడ్డు

అధ్వాన రోడ్లతో అవస్థలు

అంతారం–మన్‌మర్రి వరకు పూర్తిగా గుంతలమయం

- నిర్వహణ లేక ఛిద్రమైన పలు గ్రామాల రోడ్లు
- వాహనదారులు, ప్రజలకు తప్పని తిప్పలు
- కాగితాలకే పరిమితమైన మరమ్మతుల ప్రతిపాదనలు

షాబాద్: గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని పాలకులు చెబుతున్న మాటలు ఆచరణలో మాత్రం కన్పించడం లేదు. దీంతో ఆయా గ్రామాల్లో రహదారులు గుంతలతో అధ్వానంగా ఉండడంతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. రాత్రిపూట రోడ్లపై రాకపోకలు సాగించాలంటేనే జంకుతున్నారు. ఏళ్లు గడుస్తున్నా పాలకులు మారుతున్నారే తప్పా రోడ్ల మరమ్మతులపై అధికారులు స్పందించడం లేదని వాహనదారులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

అడుగడుగునా గుంతలే..

మండలంలోని అంతారం నుంచి మన్‌మర్రి, పోతుగల్ నుంచి మాచన్‌పల్లి వరకు, మల్లారెడ్డిగూడ నుంచి ఎర్రోనిగూడ వరకు వెళ్లేదారులు గుంతలమయంగా మారడంతో రహదారిపై ప్రయాణం చేయాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సి వస్తోందని ప్రయాణికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. మరమ్మతులు చేపట్టకపోవడంతో రోడ్డంతా గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు రోడ్డుపై ప్రయాణించేందుకు అవస్థలు పడుతున్నారు. అంతారం స్టేజీ నుంచి మన్‌మర్రి వరకు రోడ్డుపై అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. వర్షాకాలం కావడంతో గుంతలు వరదనీటితో నిండి ఉండటంతో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. మన్‌మర్రి నుంచి వందలాది మంది ప్రజలు నిత్యం ఉద్యోగాలు, నిత్యావసర సరుకుల కొనుగోలు కోసం షాబాద్, షాద్‌నగర్‌కు వెళ్తుంటారు. నిత్యం గుంతల రోడ్డుపై ప్రయాణం చేయడంతో మెన్నునొప్పి, నడుమునొప్పి వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

భయంగా ప్రయాణం..



రోడ్డుపై అధికంగా గుంతలు ఉండటంతో రాత్రివేళలో ద్విచక్ర వాహనంపై ప్రయాణించాలంటేనే భయంగా ఉంది. రోడ్డుకు ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రయాణికులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. నేను ఇటీవట రోడ్డుపై ఉన్న గుంతలో పడిపోయాను.

–ఎండీ ఇనాయత్, బోడంపహాడ్, షాబాద్

గుంతలు పూడ్చాలి..



అంతారం స్టేజీ నుంచి మన్‌మర్రి వరకు రహదారిపై అనేక గుంతలు ఏర్పడ్డాయి. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. రాత్రివేళల్లో ఈ రోడ్డుపై ప్రయాణం ప్రమాదకరంగా ఉంది. రోడ్డుపై ఉన్న గుంతలు చెరువులను తలపిస్తున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి మన్‌మర్రి రోడ్డును బాగుచేయాలి.

–నర్సింహులుగౌడ్, మన్‌మర్రి, షాబాద్

టెండర్లు పూర్తికాగానే పనులు ప్రారంభిస్తాం

మండల పరిధిలోని అంతారం, బోడంపహాడ్, మన్‌మర్రి, అప్పారెడ్డిగూడ గ్రామాలకు వెళ్లే రోడ్డుకు రూ.62లక్షలు మంజూరయ్యాయి. పోతుగల్ నుంచి మాచన్‌పల్లి వరకు రూ.5కోట్ల నిధులు, రెగోడిదోస్వాడ నుంచి బొబ్బిలిగామ వెళ్లే రోడ్లకు నిధులు మంజూరయ్యాయి. టెండర్లు పూర్తికాగానే పనులు ప్రారంభిస్తాం.

–విజయ్‌కుమార్, ఆర్‌అండ్‌బీ డీఈ

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ధర్నా, ఆర్డీఓకు వినతి



ఆర్డీఓ సాయిరాంకు వినతిపత్రం అందిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

చేవెళ్ల: పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, అరుణ్‌కుమార్‌లు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం కళాశాలల విద్యార్థులతో కలిసి ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేసి ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 8,214 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని, జిల్లాలో దాదాపు 730కోట్ల బకాయిలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ పెండింగ్ నిధులను విడుదల చేయాలని కోరారు. పెండింగ్ ఫీజులు రాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ నిధులను విడుదల చేయాలని కోరారు. లేనిపక్షంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం వారు చేవెళ్ల ఆర్డీఓ సాయిరాంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సమీర్, చందు, నిఖిల్, అదిత్య, సందీప, మనీ, నవీన్, చరణ్, కళాశాల విద్యార్థులు ఉన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, తదితరులు

మొయినాబాద్‌రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రజలందరూ విరివిగా మొక్కలు నాటి సంరక్షణకు కృషి చేయాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని కనకమామిడి గ్రామంలో, పక్కనే ఉన్న వేంకటేశ్వరస్వామి గుట్టపై 75వ వన మహోత్సవ కార్యక్రమాన్ని ఎంపీడీఓ సంధ్య నిర్వహించారు. మండల స్థాయిలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాలె యాదయ్య పాల్గొని మొక్కలునాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. కనకమామిడిలో వేయ్యికి పైగా మొక్కలు నాటాలని ఆయన అన్నారు. మొక్కలు నాటడంతో పాటు సంరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఎంతో కృషి చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి సుదర్శన్, కనకమామిడి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అమీద్, మాజీ ఉపసర్పంచ్‌లు బల్వంత్‌రెడ్డి, రాంరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి

పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సామల మహేందర్‌రెడ్డి



షాబాద్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు సభ్యత్వ నమోదు అందజేస్తున్న మహేందర్‌రెడ్డి

షాబాద్: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో పీఆర్టీయూ ఎంతో కృషి చేసిందని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సామల మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని షాబాద్ బాలుర, పోతుగల్, పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి 2024 సభ్యత్వ నమోదు వారోత్సవాలు నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులకు పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెద్దఎత్తున పదోన్నతులు, బదిలీలు జరిపించిన సంఘం పీఆర్టీయూ అని గుర్తుచేశారు. ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో విధిగా పీఆర్టీయూలో సభ్యత్వం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల పీఆర్టీయూ ప్రధాన కార్యదర్శి కృష్ణ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నర్సింలు, గండిపేట్ మండల ప్రధాన కార్యదర్శి నర్సింలు, శేరిలింగంపల్లి మండల శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు అశోక్‌రెడ్డి, కర్ణాకర్‌రెడ్డి, రాజ్‌పాల్‌సింగ్, గోవింద్ తదితరులు ఉన్నారు.

వీధి కుక్కల బెడదను అరికట్టండి

ఎంపీడీఓకు బీజేపీ నాయకుల వినతి



ఎంపీడీఓ హిమబిందూకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

చేవెళ్ల: వీధి కుక్కల బెడద నుంచి చిన్నారులను కాపాడాలని, మరోచోట ఏ చిన్నారిపై వీధి కుక్కల దాడి జరగకముందే చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు అనంత్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డిలు కోరారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీడీఓ హిమబిందూకు బీజేపీ నాయకులు వీధి కుక్కల బెడదను అరికట్టాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతీ రోజు ఎక్కడో ఒక చోట వీధికుక్కల బెడదతో చిన్నారులు ప్రాణాలు కోల్పోతున్న వార్తలు వినిపిస్తూనే ఉన్నాయన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో కూడా వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందన్నారు. మండలంలో చిన్నారులు ఎవరు ఇబ్బందులు పడకముందే వీటిని నివారించాలని కోరారు. వీధి కుక్కల సంతతి రోజు రోజుకు పెరిగిపోవటంతో ఒంటరిగా ఉండే చిన్నారులపై దాడులు చేస్తున్నాయన్నారు. వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు గ్రామాల వారీగా బెడదను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఇంద్రాసేనారెడ్డి, అశోక్, నితీశ్, చంద్రశేఖర్‌రెడ్డి, మధూకర్‌రెడ్డి, భాస్కర్, శ్రీనివాస్, జయసింహారెడ్డి, రవి ఉన్నారు.

దేవాలయ పునర్నిర్మాణానికి భూమిపూజ

షాబాద్: పురాతన దేవాలయాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు గుర్రాల విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో దర్గామాత దేవాలయ పునర్నిర్మాణానికి భూమిపూజ చేశారు. మాజీ ఎంపీపీ కోట్ల ప్రశాంతి మహేందర్‌రెడ్డి సహకారంతో దేవాలయాన్ని నిర్మిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని, ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బండ స్వర్ణలత సతీశ్‌యాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు బండ నర్సింలుయాదవ్, సంజీవరెడ్డి, కృష్ణ, రమేశ్, సంపత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత తప్పనిసరి

మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్

షాద్‌నగర్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలందరూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో నిర్వహించిన పారుశుద్ధ్య పనులను చైర్మన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. వర్షం నీరు గుంతల్లో నిల్వకుండా ఉండేందుకు చర్యలు చేపట్టామన్నారు. అదేవిధంగా మురికికాల్వలు, డ్రైనేజీలు ఎప్పటికప్పుడూ శుభ్రం చేయిస్తున్నట్లు, దోమల నివారణకు ఫాగింగ్ చేయడం, చెత్త కుండీల వద్ద బ్లీచింగ్ పౌండర్‌ను చల్లడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా మున్సిపల్ ఆధ్వర్యంలో ప్రత్యేక దృష్టి సారించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది సాయిబాబ, వెంకట్‌రాంరెడ్డి, జవాన్ ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్ వద్దు.. అంగన్‌వాడీ ముద్దు

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కొత్తూరు: ప్రైవేట్ స్కూళ్లు వద్దు, అంగన్‌వాడీలే ముద్దు అంటూ గురువారం అంగన్‌వాడీలు పట్టణంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో ఈ నెల 15 నుంచి 20 వరకు అమ్మ మాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. రెండున్నరేళ్లు నిండిన చిన్నారులను కేంద్రాల్లో చేర్పించి వారి భవితకు సహ కరించాలని తల్లిదండ్రులను ఆమె కోరారు. అన్ని కేంద్రాల్లో చిన్నారులకు ఉచితంగా పౌష్టికాహారం అందించడంతో పాటు ఆటలు ఆడించనున్నట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా వయస్సుకు తగ్గట్లుగా సరైన ఎదుగుదల, బరువు ఉన్నారా..? అనే వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై మాక్‌పోలింగ్

- ఆదర్శ పాఠశాలలో అవగాహన
- విద్యార్థులతోనే ఓటింగ్, కౌంటింగ్

చేవెళ్ల: దేశంలో ప్రజాసామ్యవ్యవస్థకు మూలంగా ఉన్న ఎన్నికల నిర్వహణ, పోలింగ్ విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు మాక్‌పోలింగ్ నిర్వహించినట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ టీనావతి తెలిపారు. చేవెళ్లలోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో గురువారం విద్యార్థులతో మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులతోనే ఓటింగ్, కౌంటింగ్‌లు నిర్వహించారు. సాధారణ ఎన్నికల మాదిరిగానే ఈ మాక్‌పోలింగ్ విధానం ఏర్పాటు చేశారు. స్కూల్ హెడ్‌బాయ్, హెడ్‌గల్, క్యాప్టెన్, వైస్ క్యాప్టెన్ పదవులకు 42 మంది విద్యార్థులు నామినేసన్ వేయగా ముగ్గురి నామినేషన్లు తిరస్కరించారు. ఆరుగురు విత్‌డ్రా చేసుకున్నారు. పోటీలో నిలిచిన విద్యార్థులకు గుర్తులు కేటాయించి పోలింగ్ నిర్వహించారు. పాఠశాల విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు ఓటు వేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ టీనావతి మాట్లాడుతూ.. ప్రజాసామ్యంలో పరిపాలన వ్యవస్థ ఎలా కొనసాగుతోంది. దీనికి కారణమైన మన ఎన్నికల విధానం, ఓటింగ్ సరళి, ఈవీఎంలపై ఓటింగ్, కౌంటింగ్ విధానంపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. భవిష్యత్‌లో ఓటు హక్కు వచ్చిన తరువాత వారు ఓటింగ్ విధానం ఎలా ఉంటుంది ఎలా ఓటు వేయాలో తెలుస్తోందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లీశ్వరి, ప్రసన్న, కుమారి, శ్రీదేవి, సుధీర, విద్యార్థులు తదితరులు ఉన్నారు.



మాక్‌పోలింగ్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

రుణమాఫీపై సంబరాలు

చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నాయకులు, పీఏసీఎస్ చైర్మన్లు, రైతులు, రైతు సంఘం నాయకుల ఆధ్వర్యంలో రుణమాఫీ చేసినందుకు గురువారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. పలువురు నాయకులు స్వీట్లు పంచుకున్నారు. చేవెళ్లలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే కాలె యాదయ్య ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం చేవెళ్లలోని రైతువేదిక వద్ద రుణమాఫీ కార్యక్రమాన్ని రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే కాలె యాదయ్య వీక్షించారు. కొత్తూరు, నందిగామ మండలాల్లో నిర్వహించిన రైతు రుణమాఫీ సంబరాల్లో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. షాద్‌నగర్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి చౌరస్తా వరకు నాయకులతో కలిసి ఎమ్మెల్యే భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా పలువురు నాయకులు, రైతులతో కలిసి రైతు వేదికల ఆవరణలో మొక్కలు నాటారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.



చేవెళ్లలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు



షాద్‌నగర్‌లో రుణమాఫీ సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్, నాయకులు, రైతులు



మొయినాబాద్: మండల కేంద్రంలో..



మొయినాబాద్ రైతు వేదికలో సీఎం ప్రసంగాన్ని వింటున్న నాయకులు, రైతులు



కేశంపేట: అల్వాలలో..



శంకర్‌పల్లి: శంకర్‌పల్లి చౌరస్తాలో క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



షాబాద్: రైతువేదికలో సీఎం ప్రసంగాన్ని వింటున్న నాయకులు, రైతులు, అధికారులు



నందిగామ: మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే శంకర్, తదితరులు